# ధారాదత్తం

భీష్ములవారు కావలసినపుడే మృతినొందగలిగినట్టు, మన భారతనారీమణి కావలసినపుడే కన్నీరు తెచ్చుకోగలదు గ్లిజరిన్ అక్కరలేకుండానే!

బజారునుంచి తిరిగొచ్చాను నిస్పృగా. రాగానే కాళ్ళు కడుక్కుందికి నీళ్లందించడం- భోజనం చేస్తున్నప్పుడు కాస్తనింపాదిగా సాంసారిక విషయాలు చర్చించడం- ఇవేంలేవు మా శ్రీమతికి.

ఫెళ్లున చెంప పగలగొట్టినట్టు "ఏమిటైంది వెళ్ళిన పని? నీరజాక్షం ఏమన్నాడు?" అని కడిగేసింది.

నాకు ఒళ్ళుమండినమాట నిజమే. కానీ ఆమె మీద ఎగిరితే వెళ్ళిన పని అవలేదుకనుక, నీరజాక్షంమీద కోపం తనమీద చూపిస్తున్నాననే అనుమానంతో కోపం దిగమింగి ఊరుకున్నాను.

"ఇప్పట్లో ఇవ్వలేనన్నాడు. ఫస్టునేనట" అన్నాను నెమ్మదిగా.

"ఇవ్వకపోతే వల్లకాదని, అత్యవసర స్థితిలో వున్నామని చెప్పకపోయేరా? పుచ్చుకున్నప్పుడు ఇచ్చిన హామీలు ఇప్పుడేమయ్యాయి?

ఈ ఫస్టుకి కాదుకదా - జీవితాంతం ఆ డబ్బు ఇవ్వడు చూడండి!" అంది మా శ్రీమతి రుసరుసలాడుతూ.

"నువ్వన్న మాటలన్నీ అన్నాను. అనకపోలేదు. కానీ ఏం చేస్తాం చెప్పు? వాడూ మనబోటి సంసారేనా?" అని మెల్లగా సర్దుకుంటున్నాను. చేసిన తప్పు కమ్ముకోడం అన్నమాట.

"అయితే అక్కడికి కుబేరులం మనమేనన్నమాట! మరేముంది? మేలిమి బంగారు మేరుపర్వతంలో చిన్నముక్క విరిచి సంసారం నడపండి చూద్దాం" అంది మా శ్రీమతి. అంతవరకు మేరుపర్వతానికి అధిపతి 'కుబేరుడు' అనే విషయం నాకు తెలియనే తెలియదు. కానీయండి, ఇదీ ఓ విధంగా జనరల్ నాలెడ్జే!

దేవాలయ ప్రాంగణాల్లో ఏవో పురాణాలు అవీ తరుచుగా వింటూండడం వలన మా ఆవిడ కాస్త పురాణవిజ్ఞానం సముపార్జించుకుని చమత్కారంగా మాటలు విసురుతూంటుందిలెండి. ఆ మాటలన్నీ నిజమని నమ్మి, నేను చచ్చుదద్దమ్మనని భావించకండి బాబూ!

"చూశారా! నిక్షేపంలా ఆ యాభై రూపాయలూ వుంటే, ధన్యంగా జీతాలందుకునేవరకూ ఒకర్ని దేహీ అనకుండా గడిచేదా? ఇంతకీ మనకొకడు బాకీ వుండగా మనం ఇంకోణ్ణి యాచించడమేంటండీ ఖర్మ కాకపోతే?

ముందు అప్పడగడానికి వచ్చినప్పుడు మాత్రం - 'మీరేమిటండీ గదాధరంగారూ! మీ తాత ఎంత మంచివాడూ! మీ నాన్న ఎంత మంచివాడూ! ఓహో! అటువంటి వంశంలో పుట్టినటువంటి మీరెంతవారూ!' అంటారు.

ఇహ తిరిగీ మన డబ్బు మనం అడగబోయేసరికి నవగ్రహాల్లో ఏడోవాడంటారు. బావుందండయ్యా మీ ధోరణి! మహ బాగుంది" అనిదెప్పి పొడిచింది.

"సరే అయిందేదో అయింది, ఇహ భోయినానికి లేవండి" అంది.

ఇలా అడుగడుగునా దెబ్బలు కొడుతూనేవుంది హుషారుగా. కాకపోతే వంటింట్లోంచి అప్పడాలకర్రలు మాత్రం ఎగరలేదు. ఇలాంటి చురుకైన పెళ్ళాం దొరకడం కూడా అదృష్టమేలెండి.

భోజనం చేస్తున్నాను.

రెండో ప్రశ్నవేసింది.

ద్వితీయ ప్రపంచసంగ్రామం ఇది :

"ఘంటయ్యశాస్త్రి గారు పట్టుకెళ్ళిన పోతన భాగవతాన్ని తిరిగీ ఇచ్చేశారా?"

నేను నీళ్ళు నమిలేస్తున్నాను. ఆమె దృష్టి మరల్చియాలని "అబ్బ! కూరలో ఏమిటి ఇంత కారం దంచేశావ్? గూబరింగుమంటూంది!" అన్నాను.

"మరేం ఫర్వాలేదు. ఓ ఇంత బెల్లం వేసుకోండి" అని బెల్లం డబ్బా తీసి ఓ ఇంత బెల్లం ముక్క పడేసింది.

వెధవది! నా దురవస్థ చూడండిక!

"ఆ చెప్పండి శాస్త్రి ఏమన్నాడో?"

"చెప్పడానికేముంది? ఆయనకు ఏ ఊరో ట్రాన్స్‌ఫరయిందిట. సంసారం ఎత్తి వెళ్లిపోయేట్ట!" అన్నాను.

"అయ్యో! నిక్షేపంలాంటి పుస్తకం పోయిందండీ! వెధవ డబ్బు పోతే పోయిందిగాని పుస్తకం పోతే ఎలా చెప్పండి? రోజూ ఆ గజేంద్రమోక్షం చదువుతూంటే ఆ శ్రీ మహావిష్ణువు నామొరకూడా ఆలకిస్తాడని ఆశించేదాన్ని" అని దు:ఖించింది.

"అందుకే అన్నారు పుస్తకం వనితా విత్తం పరహస్తం గతం గత: అని. ఇవి ఒకరిచేతిలోంచి తిరిగీ ఊడిపడ్డం కల్ల! అనుభవజ్ఞుల సూక్తి పొల్లుకాదు" అని ఇంకా ఏమేమో అంది.

మా ఆవిడ దృష్టాంతంగా తెచ్చిన ఈ సుభాషితంతో నేను పూర్తిగా ఏకీభవించలేక పోయాను. పుస్తకం, విత్తం - ఈ రెండింటి విషయంలో మహానుభావుల సూక్తి సరిపోయింది. ప్రస్తుతం ఈ రెండూ నేను కోల్పోయాను కనుక!

కానీ వనిత మాటేమిటి? పెళ్ళాన్నెవడూ పరాయి పురుషుడికి చేజేతులా ధారాదత్తం చెయ్యడుకదా? ప్రతి సూక్తికీ మా ఆవిడకు నేను దొరికేనుకాని, ఇక్కడ మాత్రం అదే నాకు దొరికింది! పిచ్చికలా దొరికిపోయింది!

"ఔనులేవే! నువ్వన్నది కొంత నిజమేనే! పుస్తకమూ విత్తమూ చాలామంది కోల్పోతుంటారు కనుక, నువ్విచ్చిన దృష్టాంతం సరిపోయింది.

కానీ వనిత గురించేమిటంటావ్?

కట్టుకున్న పెళ్లాన్నెవడూ ధారాదత్తం చెయ్యడు కదా! ఇప్పుడు చెప్పు, ఏం సమాధానం చెబుతావో?" అన్నాను, మీసాల్లేక పోయినా మీసం మీద చెయ్యివేసి.

ఇలా నేనన్నానో లేదో, మా ఆవిడ చురుకుదనం, ఉత్సాహం అంతా మటుమాయమయ్యాయి. మొహం వెలవెలపోయింది. దు:ఖం పొర్లుకొచ్చింది. చెంపకు

చెయ్యి పరంబగునపుడు కదా కంటినుండి నీరు ఆదేశంబగు? కానీ చెంపకు చెయ్యి పరంకాకుండానే, కంటినుండి నీరు ధారావాహికంగా వచ్చింది మా ఆవిడకి!

"మీ కాళ్ళు కడిగి, నన్ను మీకు ధారాదత్తం చేసి, మా నాన్నగారు ఏంటి సుఖపడ్డారు చెప్పండి? ఆర్నెల్ల పొద్దయింది. ఉన్న ఊళ్ళోవుండీకూడా ఒక్కనాడైనా నన్ను మా పుట్టింటికి పోనిచ్చేరు?" అని వలవల ఏడ్చేసింది.

"రైట్ రైట్! ఇహనూరుకో! నువ్వు చెప్పిన దృష్టాంతం కరెక్టు. పద! మీ వాళ్లింటికి ఇప్పుడే దిగపెట్టేస్తాను. ఓ పదిరోజులుండి వద్దువుగాని" అన్నాను.

చెప్పానుగా? భీష్ములవారు కావలసినప్పుడే మృత్యువు పొందగలిగినట్టు, ఈ ఆడవాళ్ళు కావలసినప్పుడే కన్నీరు తెచ్చుకోగలరు.

స్వాతి సపరివార పత్రిక 28-6-96